విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 07 ఆగస్టు 2025 8 పేజీలు



క్వారీలు..కార్మికుల పాలిట ఘోరీలు

- కార్మిక చట్టాలు, నిబంధనలు బేఖాతరు
- భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- నామమాత్ర తనిఖీలతో సరిపెడుతున్న అధికార యంత్రాంగం

విశాలాంధ్ర - సంతమాగులూరు : దొరికితే దొంగలు లేకపోతే దొర అన్నట్లుగా గ్రానైట్ క్వారీ నిర్వాహకుల వ్యవహారం ఉంది. ఇందుకు ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలే నిదర్శనం.యాజమాన్యాల నిర్లక్ష్య ధోరణితో బతుకు తెరువు కోసం వచ్చిన వలస కూలీలకు బండరాళ్ల కింద ఘోరీలు కదుతున్నారు. ఇందుకు రెండు రోజుల క్రితం బల్లికురవ మండలం సమీపంలో ఓ గ్రానైట్ క్వారీలో జరిగిన పెను ప్రమాదమే సాక్ష్యం. బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని మూడు మండలాల్లో సుమారు 65 పైచిలుకు గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా వందల సంఖ్యలో గ్రానైట్ పాలిష్ యూనిట్లు నడుస్తున్నాయి. ఈ క్వారీలో పనిచేసేందుకు మధ్యవర్తులు (మేస్త్రీలు) సాయంతో పొరుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో కూలీలను తరలిస్తున్నారు. అంతవరకు సాఫీగానే ఉన్నప్పటికీ వారికి మౌలిక సదుపాయాలు, జీతభత్యాలు, రక్షణ చర్యలు కల్పించడంలో కొన్ని క్వారీల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

- వారి లోపాలు..కూలీలకు శాపాలు :

బల్లికురవ గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో యాజమాన్యం లోపాలు అడుగడుగునా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈనెల 3న సత్యకృష్ణ క్వారీ లోపలకి వెళ్లిన కూలీల వివరాలు, కనీస సమాచారం కూడా వారి వద్ద లేదంటే, ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుంది. రోజువారీ పనికి వచ్చే కూలీల షిఫ్టులు, వారిపట్ల పర్యవేక్షణ కొరవడిందని చెప్పాలి. సాధారణంగా గ్రానైట్ పరిశ్రమలలో యాజమాన్యాల విషయానికి వచ్చేసరికి, మార్పులు చేర్పులు సహజంగా ఉంటాయి. అయితే నిర్వహణలో మాత్రం ఎలాంటి మార్పులు కనిపించే పరిస్థితి లేకపోయింది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా క్వారీలో నెలకొన్న సమస్యలు, లోపాలు సరిచేయడంలో వారు పూర్తిగా విఫలమవుతున్నారు. ఈ కొండ ప్రాంతాల్లోనే మరో పదికి పైగా క్వారీలు ఉన్నాయి. వీటిలో కూడా కొన్ని గనులలో కూలీల వివరాలు ఒక గ్రానైట్ మిగతా 2 లో ...

కొండపి పంచాయతీ

ఏకగ్రీవం కాదు

- వైసీపీ అభ్యర్థి విత్ డ్రా చేసుకోలేదు
- హాస్పిటల్లో ఉండగా, దొంగ సంతకాలతో విత్ డ్రా పేపర్ల సమర్పణ
- అప్రజాస్వామ్యకంగా మంత్రి కనుసన్నలలో పోలీసుల దాడులు
- మాకు ప్రత్యర్థి..కూటమి ప్రభుత్వమా, పోలీసులా..?
- విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఫైర్

విశాలాంధ్ర -ఒంగోలు : కొండేపి పంచాయతీ ఏకగ్రీవం కాలేదని, తమ అభ్యర్థి విత్ డ్రా పేపర్లపై సంతకాలు చేయలేదని, దొంగ సంతకాలతో, దొంగ సాక్షులతో, అధికార పార్టీ నాయకులు, ఎన్నికల అధికారులు కుమ్మక్కై టీడీపీకి ఏకగ్రీవం చేశారని మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజకవర్గం ఇంచార్జ్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. ఒంగోలులోని వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సురేష్ మాట్లాడుతూ కొండేపి పంచాయతీ ఎస్సీ మహిళ సర్పంచ్ రిజర్వేషన్ వచ్చిందన్నారు. దీంతో వైసిపి తరపున నుండి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారన్నారు. వారిలో ఎడవల్లి కళ్యాణిని పోలీసులు బెదిరించి విత్ డ్రా ఫారాలు మీద మిగతా 2 లో ...

ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరికలు 6 లో..

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుండి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా అధికారులతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో, మండలంలో మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు, వైద్యాధికారులు ఒక ప్రణాళిక ప్రకారం నివాస ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆయన తెలిపారు. నగరం మండలంలో ఈదుపల్లి గ్రామంలో ఒక డెంగ్యూ మృతి నమోదయిందని ఆయన తెలిపారు.డెంగ్యూ వ్యాధి దోమ కాటు వలన వస్తుందన్నారు. డెంగ్యూ వ్యాధికి కారణమైన దోమలు వాటి సంతానాన్ని మంచినీటిపై వృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు.ప్రజలు మంచినీటిని ఐదు రోజుల కంటే ఎక్కువ రోజులు నిల్వ చేయకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని ఆయన తెలిపారు. మంచి నీటిని నిల్వ చేయాల్సిన పరిస్థితుల్లో డ్రమ్ములపై దుస్తులతో,ఇతర వస్తువులతో వాటిని కప్పి ఉంచాలని ఈ ప్రకారంగా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.ఈ విషయమై సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని సూచించారు.

బాపట్లను కుదిపేస్తున్న డెంగ్యూ

- డెంగ్యూ లక్షణాలతో ఇరువురు మృతి
- ఎనిమిది మందికి పాజిటివ్
- ఈ ఏడాదిలో 18 కేసులు నమోదు
- 92 మందికి విషజ్వరాలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ
- జిల్లా వ్యాప్తంగా పడకేసిన పారిశుద్ధ్యం
- భయం గుప్పెట్లో ప్రజలు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : బాపట్ల జిల్లాను డెంగ్యూ కుదిపేస్తుంది. జిల్లాలో ఈ ఏడాది 18 డెంగ్యూ కేసులు నమోదు కాగా ఇరువురు మృతి చెందారు. జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు 92 కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు రెండు కేసులు మలేరియా నమోదు కావటం వైద్య ఆరోగ్య శాఖ పూర్తిగా నిద్రపోతుంది. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టకుండా కనీసం బ్లీచింగ్ సున్నం చల్లకుండా పంచాయితీ మున్సిపల్ యంత్రాంగాలు నిద్రలో జోగుతున్నాయి.

- జిల్లా వ్యాప్తంగా పంచాయితీ, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయి.

వర్షంకు కురిసిన నీరు నిలబబటం దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు విషజ్వరాల భారీన పడుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయి పరిశీలన లేక అవగాహన కల్పించటంతో విఫలం కావటంతో అవగాహన లేమితో ప్రజలు జ్వరాల భారీన పడి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. గడిచిన పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. దోమల నివారణకు పంచాయతీ శాఖ అధికారులు మున్సిపాలిటీ మిగతా 2 లో ...

బస్ జాతాను జయప్రదం చేయండి
సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాస్ 7 లో..

జర్నలిస్టులకు నూతన అక్రిడిడేషన్లు మంజూరు చేయాలి : రమణ 7 లో..

రాజుపాలెంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలంలోని రాజుపాలెం బీసీ అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐసీడీయస్ సూపెర్వైజర్ హైమావతి ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కృపావతి మాట్లాడుతూ తల్లిపాల యొక్క ప్రాధాన్యత వివరించారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలను అందివడం శ్రేయస్కరం అన్నారు. దీనిద్వారా పిల్లలకి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది అన్నారు.అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామ సుబ్బయ్య, సిహెచ్ ఓ జయంతి, ఎ యన్ యం సువర్ణ లక్ష్మి,మహిళా పోలీసు జయశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు కొండమ్మ, సరస్వతి, సువర్ణ కుమారీ, బాలమణి, ఆశా సలోమి,తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పెండింగ్ పై అవగాహన విశాలాంధ్ర. కొమరోలు మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పథకంలోని పెండింగ్ రికార్డులపై గ్రామ రెవెన్యూ అధికారులు మరియు వ్యవసాయ సహాయకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడమైనది.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ డి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడతలో 406 ఖాతాలు ఆధార్ కరెక్షన్స్ మరియు డెత్ మ్యుటేషన్స్ జరగక పెండింగ్ లో ఉన్నాయని తెలియజేశారు. వీటికి సంబంధించిన రైతులు సచివాలయ సర్వీసెస్ ద్వారా ఆగస్టు నెల ఆఖరిలోపు అప్లై చేసినట్లయితే వాటిని పరిష్కరించి రెండవ విడతకు అర్హులు చేసేందుకు వీలుంటుందని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి కె.రాజశ్రీ మాట్లాడుతూ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు పెండింగ్ లో ఉన్న రైతులను చైతన్యపరిచి కరెక్షన్ కొరకు సచివాలయం ద్వారా అప్లై చేయించాలని తెలియజేశారు. తదుపరి గ్రామ రెవెన్యూ అధికారులు వాటిని పరిశీలించి తహసిల్దార్ కు నివేదిక అందజేస్తారని తెలియజేశారు. తాసిల్దార్ కరెక్షన్ చేయడం ద్వారా సంబంధిత రైతులు రెండవ విడతకు అర్హులు కాగలరని తెలియజేశారు.

నిబంధనలకు విరుద్ధంగా విధులు కేటాయింపు

- యర్రగొండపాలెం విద్యుత్ ఏఈ ఇష్టారాజ్యం
- ముడుపులు ఇస్తేనే పనులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలం అమానుగుడిపాడు గ్రామ సబ్ స్టేషన్లో సన్నేపోగు బాబు, నాగేంద్ర బాబు, పుచ్చకాయల శ్రీను, అవినాష్ కుమార్ అను ఈ నలుగురు సబ్ స్టేషన్ కి షిఫ్ట్ ఆపరేటర్స్ గా విధులు నిర్వహిస్తూ ఉండేవారు. ఈ నలుగురిని అకారణంగా విధుల నుంచి తప్పించి మండలంలోని ఇతర సబ్ స్టేషన్ల నుండి ఇతర ఉద్యోగులను రప్పించి డ్యూటీలను చేయించడం విడ్డురంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. మరి ఇలాంటి పరిస్థితులు పక్క మండలాలలో ఉన్నాయో లేదో ఆ శాఖ అధికారులకే తెలియాలి. అమానిగుడిపాడు విద్యుత్ ఉపకేంద్రంలో కొన్ని నెలల నుండి తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నారు. అమానుగుడిపాడు వాచ్మెన్గా పర్మినెంట్ ఉద్యోగి వెంకట్రావు అనే వ్యక్తి డ్యూటీకి హాజరు కాకుండా బయటి వ్యక్తి దిద్దేల వెంకటరెడ్డి అనే వ్యక్తి వాచ్మెన్ గా డ్యూటీలు వేయడం నిబంధనలకు విరుద్ధం. ఎలా డ్యూటీలు చేస్తారని ప్రజల ప్రశ్నిస్తే విద్యుత్ ఏఈ అల్లూరయ్య ఉద్యోగంలో ఉండమని చెప్పాడనడం గమనార్హం. వాచ్మెన్ ఉద్యోగమే కాకుండా షిఫ్ట్ ఆపరేటర్ల పని కూడా తానే చేస్తున్నాడని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.ఆ నలుగురు ఉద్యోగులను విధుల నుంచి తొలగించి తాత్కాలికంగా వాచ్మెన్ను షిఫ్ట్ ఆపరేటర్ల అందరినీ ఎస్.ఎస్ లో డ్యూటీలకు హాజరయ్యాలా చేస్తున్న ఏఈ అల్లూరయ్య పై జిల్లా విద్యుత్ ఎస్ ఇ కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై మార్కాపురం డీఈని వివరణ కోరగా పిర్యాదు అందిందని విచారణ జరిపించి నిబంధనలు మీరితే సదరు ఏఈపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘోరీలు

(మొదటిపేజీ తరువాయి)

అంతంత మాత్రమే అంటే నమ్మశక్యం కాదేమో.

- వారికి కోట్లు.. వీరికి పస్తులు

క్వారీ నిర్వహణ కొన్ని కోట్ల రూపాయల ఖర్చుతో కూడినది.అదే స్థాయిలో లాభాలు కూడా ఉంటాయి.ఆ విషయాన్ని మాత్రం ఏ యాజమాన్యం బహిర్గతం చేయలేదు. ఎందుకంటే,ప్రభుత్వం నుంచి పన్నుల చెల్లింపు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని భయం.నిర్వాహకుల ఆదాయం రెట్టింపు అవుతున్నప్పటికీ ఆ క్వారీల్లో పనిచేసే కార్మికులు బతుకులు దుర్భరంగా మారుతున్న పరిస్థితులు కోకొల్లలు.కార్మిక చట్టాల ప్రకారం వారికి కనీస వేతనాలు చెల్లించలేని స్థితిలో కొన్ని యాజమాన్యాలు ఉన్నాయంటే అతిశయోక్తికాదు. క్వారీలో పనిచేసే వారు ఎక్కువగా పొరుగు రాష్ట్రాలైన ఒడిశా,ఈస్ట్ బెంగాల్ తదితర చోట్ల నుంచి వలసలు వస్తుంటారు.వీరికి ముడిరాయిని కట్ చేసి,అడుగుల లెక్కన నగదు నిర్ణయిస్తారు.నెలకు సరాసరి రూ.12-15వేల వరకు కూలి సొమ్ము జమ చేస్తారు.అందులోనే వారు తమకు,కుటుంబ సభ్యులను పోషించుకోవాల్సి ఉంటుంది.ఆ డబ్బు సరిపోక పస్తులు ఉన్న సందర్భాలు అనేకం ఉన్నాయని,వారి గోస ఎవరికి చెప్పుకోవాలో తెలియదు. చెబితే ఏ సమస్య వస్తోందనని వలస జీవులు సతమతమవుతున్నారు.ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఆరోగ్య సమస్యలు,ప్రమాదాల రూపంలో వారిని కోలుకోలేని స్థితిలో నెడుతున్నాయి.ఒకసారి క్వారీలోకి వెళితే ప్రాణాలతో బయటకు వచ్చేదీ లేనిదీ తెలియదు.వారి జీవితాలను పణంగా పెట్టి పనిచేస్తున్నా యాజమాన్యాలకు కనికరం లేకుండా పోయింది.

- ఇచ్చట తనిఖీలు కాగితాల్లోనే :

భూగర్భ గనులు,ఇతరత్రా శాఖల అధికారులు గ్రానైట్ పరిశ్రమలలో తనిఖీలు చేసి ఉంటే,నేడు ఇంతమంది మరణాలు సంభవించేవి కాదేమో. కార్మికుల భద్రత కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా మొక్కుబడిగా నిర్వహిస్తారనేది జగమెరిగిన సత్యం.పనిలోకి వెళ్లే కార్మికులకు భద్రతా పరమైన రక్షణ పరికరాలు లేకపోవడం ఒక ఎత్తు అయితే ఆదివారం సెలవు దినంలోనూ పనులు చేయించడంపై వలస కూలీలు పట్ల కనికరం లేదని స్పష్టమవుతోంది.ఈ అంశాలపై సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారా, నిబంధనలు పాటించని గనులపై చర్యలు తీసుకున్నారా అంటే వాటికి సమాధానం కాగితాల్లోనే కనిపిస్తాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో మాత్రమే కాస్తంత హడావుడి చేస్తారు.తక్కిన సమయంలో తూతూమంత్రంగా తనిఖీలతో సరిపెడుతుంటారని సామాన్య ప్రజల సనుగుడు.

- హెచ్చరికల సైరన్ ఎక్కడ :

క్వారీలో పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదం జరిగితే,మిగిలిన వారిని అప్రమత్తం చేసేందుకు హెచ్చరికల సైరన్ లేకపోవడం గమనార్హం. అంతేకాదు ప్రమాదానికి గురైన వారికి ప్రథమ చికిత్స అందించేందుకు మెడికల్ కిట్లు కూడా అందుబాటులో లేవని తేటతెల్లమైంది.విధుల్లో ఉన్న కూలీల వివరాలను ఆఫీసు బయట నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాల్సి ఉన్నా,అవేమీ లేవు.వీటికి తోడు క్వారీల చుట్టూ విద్యుత్ తీగలు యమపాశంలా వేలాడుతూ దర్శనమిస్తున్నాయి.

బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్

- సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

బల్లికురవ సమీపంలో ఉన్న ఓ గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రతుకు తెరువు కోసం ఒడిశా నుంచి వచ్చిన కార్మికులు అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమన్నారు.కార్మికుల హక్కులు చట్టాలను కాగితాలకే పరిమితం చేస్తూ క్షేత్ర స్థాయిలో అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు.అంతేకాకుండా నిబంధనలకు నీళ్లు వదిలేసి,సెలవు దినాల్లో కూడా కార్మికులతో వెట్టిచాకిరి చేయించడంపై సింగరకొండ ఆగ్రహం వ్యక్తం చేశారు.పని జరిగే ప్రదేశంలో మౌలిక సదుపాయాలు,రక్షణ కల్పించడంలో క్వారీ నిర్వాహకులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.ఇది ముమ్మాటికీ యాజమాన్యం ఘోర తప్పిదమే అని ఆరోపించారు.ప్రమాదం సంభవించిన తీరుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే మృతదేహాలను వారి సొంత ప్రదేశాలకు తరలించే బాధ్యతను అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అదేవిధంగా బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.

భూసారాన్నిబట్టి సాగు చేయాలి

విశాలాంధ్ర -కొనకనమిట్ల : మండలంలోని వాగు మడుగు గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి కే ప్రకాష్ రావు ఆధ్వర్యంలో బుధవారం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ బాబు భూసారాన్ని బట్టి సాగు చేసే పంటలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో వచ్చేది తెగుళ్ల నివారణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలుగురించి రైతులకు సూచనలు సలహాలు చేశారు. మండల వ్యవసాయ అధికారి కే ప్రకాష్ రావు మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ వరకు పంటల బీమా గడువు పొడిగించారని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా డబ్బులు రాని రైతులు తగిన డాక్యుమెంట్లు తీసుకొని దగ్గరలోని రైతు సేవ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు ఈ కార్యక్రమంలో బీటీఎం నాగభూషణం గ్రామ వ్యవసాయ సహాయకుడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర పెద్దదోర్నాల : అప్పుల బాధ తట్టుకోలేక రైతు. ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిన్న గుడిపాడు గ్రామ పొలాలలో బుధవారం జరిగింది. అందిన సమాచారం ప్రకారం చిన్న గుడిపాడు గ్రామానికి చెందిన నాలి శివ 29 సంవత్సరాలు, అనే రైతు 3 ఎకరాల పొలంలో పత్తి పంట వేసి సాగు చేస్తున్నాడు. పంట కోసం అప్పులు చేసి , అప్పుల బాధ తట్టుకోలేక , పొలంలో యాప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు చిన్న పిల్లలు కలరు.సమాచారం అందుకున్న దోర్నాల పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాపట్లను కుదిపేస్తున్న డెంగ్యూ

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో పరిస్థితి చేయి దాటి పోయింది.

– దోమలు యాంటీ లార్వా వృద్ధి చెందకుండా ఫాగింగ్ తదితర చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. మురికి కాలువల్లో కుంటల్లో దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. పంచాయితీ సిబ్బంది నుంచి జిల్లా అధికార యంత్రాంగం వరకు నిద్రలో జోగుతూ ప్రజారోగ్యాన్ని పూర్తిగా విస్మరించారు. అధికారులు తూతూమంత్రంగా విధులకు హాజరుకావటం విధి నిర్వహణలో మమ అనిపించటం పరిపాటిగా మారింది. జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది.

– జిల్లాలో మలేరియా నియంత్రణ అధికారులు అసలు ఉన్నారా లేరా అనే సందేహం వ్యక్తం అవుతుంది. గ్రామాల్లోకి వెళ్లి దోమలు నివారణ మందులు పిచకారి చేసిన దాఖలాలు లేవు. వైద్యఆరోగ్య శాఖ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న దాఖలాలు మచ్చుకేన కనిపించటం లేదు. జ్వరాలు నమోదవుతున్న సమయంలో అప్రమత్తమవ్వాల్సిన వైద్యఆరోగ్యశాఖ నిద్రపోతూ ప్రజలు ప్రాణాలు బలిగొంటుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి నీరు నిల్వకుండా చెత్తను ప్రతి రోజు తొలగిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎంతైన ఉంది.

ఏకగ్రీవం కాదు

(మొదటిపేజీ తరువాయి)

సంతకాలు చేయించారన్నారు. రెండవ అభ్యర్థి విమలమ్మ తెలుగు తమ్ముళ్లు, పోలీసుల వేధింపులు తట్టుకోలేక ఊరు విడిచి దూరంగా తల దాచుకున్నాడు అన్నారు. అయితే వారిని పోలీసులు వేటాడి వెంటాడి ఎక్కడున్నారో కనుక్కొని సంతకాలు చేయించి విత్ డ్రా చేయించారన్నారు. మూడవ అభ్యర్థి పల్లె మీరమ్మ పోలీసుల బెదిరింపులు తట్టుకోలేక ఇంట్లో కూడా చెప్పకుండా దూరంగా తమ బంధువుల ఇంట్లో తల దాచు కున్నారన్నారు. అయితే తనకు తెలియకుండా తాను హాస్పిటల్ లో అనారోగ్యంతో ఉన్నట్లు చెప్పి దొంగ సంతకాలతో, సాక్షులతో విత్డ్రా ఫారాలు ఎన్నికల అధికారులకు అందజేశారు అన్నారు. అయితే మీరమ్మ విత్ డ్రా ఫారాలపై సంతకాలు చేయలేదని, ఎన్నికలలో వైసిపిని ఎదుర్కోలేక రాష్ట్ర మంత్రి స్వామి కనుసన్నలలో పోలీసులు దాడులకు, బెదిరింపులకు గురి చేసి ఏకగ్రీవం చేశారని విమర్శించారు. సమస్యలను కలెక్టర్, ఎన్నికల అధికారంలో దృష్టికి తీసుకుపోయామని , ప్రజాస్వామ్యబద్ధంగా కొండపి ఎన్నికలు నిర్వహించాలని సురేష్ డిమాండ్ చేశారు. సర్పంచ్ అభ్యర్థి మీరమ్మ మాట్లాడుతూ తన కుటుంబాన్ని పోలీసులు బెదిరించారని ఆరోపించారు. తాను విత్డ్రా ఫారాలపై సంతకాలు చేయలేదని, తాను పూర్తిగా ఆరోగ్యం గానే ఉన్నానని, ఎన్నికలలో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, అధికారులు తనకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తానని పేర్కొన్నారు. వైసిపి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ బత్తుల బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావటం లేదన్నారు. అధికార పార్టీకి దమ్ము ధైర్యం ఉంటే పారదర్శకంగా కొండపిలో ఎన్నికలు నిర్వహించి గెలవాలని సవాల్ విసిరారు. సమావేశంలో పలువురు వైఎస్సార్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఒంగోలులో బీజేపీ 'సారథ్యం'

విశాలాంధ్ర -ఒంగోలు : ఒంగోలు నగరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ గురువారం పర్యటించనున్నారని, సారథ్యం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని 20 సూత్రాల అమలు పథకం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. స్థానిక ఎంఎస్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలను బిజెపి అధ్యక్షుల వారి దృష్టికి తీసుకుపోతామని పేర్కొన్నారు. ప్రధానంగా పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని, వీటితో పాటుగా పది సమస్యలను అతి చిలుక వివరిస్తావని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు సేగ్గం శ్రీనివాసరావు మాధవ్ పర్యటన ఒంగోలులో ఉదయం 8 గంటలకు పాత బైపాస్ రోడ్డులో విందు భోజనం హోటల్ దగ్గర చాయ్ పే చర్చ కార్యక్రమం, అనంతరం నాయుడుపేట సాయిబాబా గుడి వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించుట, అనంతరం పాత కూరగాయల మార్కెట్ వద్ద నుండి ఎమ్మెస్ ఫంక్షన్ హాల్ వర్క్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మీడియాతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఢిల్లీ రెస్టారెంట్‌లో మేధావులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం బిజెపి కార్యకర్త ఇంటిలో భోజనం చేసి పర్యటన ముగిస్తారని తెలిపారు. బిజెపి ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ యోగయ్య యాదవ్ మాట్లాడుతూ మాధవ్ ఒంగోలు పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాకినేని అమరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు రాయపాటి అజయ్ పాల్గొన్నారు.

తక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడాలి

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలంలోని బి.చెర్లోపల్లి గ్రామలో ఆత్మ ప్రకాశం జిల్లా వారి ఆధ్వర్యంలో "ఖరీఫ్ పంటల్లో సమీక్రుత పంటల యాజమాన్యం"పై శిక్షణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఎన్.లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్ ఏడిఏ డి. బాలాజీ నాయక్ మాట్లాడుతూ తక్కువ మోతాదులో రసాయనిక ఎరువులని వాడాలని, వాటి స్థానంలో జీవన ఎరువులని, సేంద్రియ ఎరువులని వాడి సేద్యం ఖర్చులని తగ్గించుకోవాలని కోరారు. ఖరీఫ్ సాగులో అనువైన పంటల రకాల వాటి గుణగనాల గురించి వివరించారు. అదేవిధంగా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా మీ మీ పొలాలను లోదుక్కులు చేపట్టాలని తద్వారా భూమి నుండి ఆశించే వేరుకుళ్ళు తెగుళ్ళల నుండి పంటలు రక్షించుకోవచ్చునని, అంతేకాకుండా కలుపును కూడా సమర్ధవంతంగా అరికట్టవచ్చునని తెలియజేశారు. మొక్కజొన్న విత్తనోత్పత్తి చేసే రైతులు కంపెనీ ల నుండి ఒప్పంద పత్రాలని తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకంలో జమ కాని రైతులు గ్రీవెన్స్ ని రైతు సేవా కేంద్రం లోని వ్యవసాయ సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లక్ష్మినారాయణ పాల్గొని, మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు స్వయంగా వారి వారి సమస్యలను నేరుగా అధికారులకు వివరించి వారి సమస్యలకు పరిష్కారాని పొందగలిగారు. ఆత్మ పథకం బిటీ ఎం.శ్రీమతి సురేఖ మాట్లాడుతూ వారు చేపట్టబోయే డిమాంస్ట్రేషన్స్,విజ్ఞాన యాత్రల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సునీల్ నాయక్, ఆర్ఎస్కే సిబ్బంది శ్రీకాంత్, రవి, సభ్యులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లి పాలే మొదటి టీకా

విశాలాంధ్ర-దొనకొండ: పుట్టిన బిడ్డకు తల్లి పాలే మొదటి టీకా అంటూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిహెచ్ సుభాషిణి తెలిపారు. స్థానిక బేతేలుపురం, ఆరవల్లిపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సుభాషిణి ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఎంఎల్‌పీహెచ్ రూతమ్మ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలల నుండి రెండేళ్ళ వరకు తల్లి పాలతో పాటు పౌష్టికాహారం ఇవ్వటం ద్వారా పిల్లల్లో బుద్ధి వికాసానికి, శారీరక ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. క్రమం తప్పకుండా బిడ్డకు పాలు ఇవ్వటం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి రొమ్ము క్యాన్సర్ రాదని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త జయమణి, ఆయా పద్మాబాయి, ఆశా నాగేంద్రమ్మ, తల్లులు, గర్భవతులు, బాలింతలు, చిన్నారులున్నారు.

నేడు స్వయంవరం షోరూం ప్రారంభం

విశాలాంధ్ర -ఒంగోలు : స్థానిక గుంటూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన స్వయంవరం షోరూంను బుధవారం ప్రారంభిస్తున్నట్లు షోరూమ్ మేనేజర్ సతీష్ పేర్కొన్నారు. షోరూమ్ ఆవరణములో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ షో రూమ్ను ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. స్వయంవరం షోరూంలో దేశవ్యాప్తంగా 87 ఉండగా, తెలుగు రాష్ట్రాలలో 14 ఉన్నాయని పేర్కొన్నారు. తన షో రూమ్ నందు ప్రధానంగా పెళ్లి, పెళ్లిచూపులు, అన్ని రకాల ఫంక్షన్లకు మగవారి బ్రాండెడ్ దుస్తులు లభిస్తాయి అని తెలిపారు. ప్రధానంగా షేర్వానీలు, ఇండో వెస్టన్, సెమీ ఇంకో వెస్టన్, మోడీ కోట్, సూట్స్, బ్రదర్స్, కుర్తా పైజామా, హ్యాండ్లూమ్ సెట్స్, వెస్ట్ కోట్స్, చున్నీమాలోస్ తదితర అన్ని రకాల, మగవారి దుస్తులు లభిస్తాయి అని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో షోరూం సిబ్బంది శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక శక్తిని పెంచే తల్లిపాలు

విశాలాంధ్ర- పామూరు : పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అని కనిగిరి ఇంచార్జ్ సిడిపిఓ పి లావణ్య అన్నారు. ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల్లో భాగముగా కానిగా మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం తల్లులకు అవగాహన కార్యక్రమం ను సూపర్వైజర్ గోళ్ళ పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిడిపిఓ లావణ్య మాట్లాడుతూ లావణ్య మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డలకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్యలు మాట్లాడుతూ అంగనవాడి కేంద్రాలలో అందించే పౌష్టికి ఆహారమును క్రమము తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వయంకృషి సేవ సంస్థ అధ్యక్షులు డాక్టర్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన

విశాలాంధ్ర-దొనకొండ: విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దని, వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీయం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురు నిరసన తెలిపి విద్యుత్ సిబ్బందికి అర్జీ అందజేశారు. స్మార్ట్ మీటర్లు బిగింపు తక్షణం ఆపాలని, ఇప్పటికే బిగించిన వాటిని వెంటనే తొలగించాలని, ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, అదనంగా వసూలు చేసే యూనిట్ చార్జీలు రద్దు చేయాలని, అదానీ కంపెనీతో జరిగిన సఖీ ఒప్పందాన్ని రద్దు చేసి కూటమీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రమాదకర విద్యుత్ సంస్కరణలు, చట్ట సవరణలను నిలిపి వేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిరుపల్లి అంజయ్య, కుందుర్తి అనిల్, ప్రభాకర్, కిరణ్, రామయ్య తదితరులున్నారు.

ఫిజియోథెరపీ వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - పుల్లలచెరువు : ఈనెల 19వ తారీకు ఎర్రగొండపాలెం నందు దివ్యాంగ విద్యార్థులకు అసెస్మెంట్ క్యాంప్ నిర్వహించబడును అని ఎంఈఓ ఇందిరా ప్రసాద్ తెలిపారు. స్థానిక నాన్ భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపు ఎంఈఓ పరిశీలించారు. వివిధ గ్రామాల నుంచి హాజరైన కొంతమంది దివ్యాంగ విద్యార్థుల నడక సామర్థ్యాలను దగ్గరుండి పరిశీలించారు. మండలంలోని అన్ని పాఠశాలలో గల దివ్యాంగ విద్యార్థులు ఈనెల 19వ తారీకు ఎర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వం వారు దివ్యంగా విద్యార్థులకు నిర్వహించే అసెస్మెంట్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

విశాలాంధ్ర- పుల్లల చెరువు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాక్షస పాలన చేస్తుందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిలదీసి బాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలిసేందుకు బాబు షూరిటీ మోసం గ్యారంటీ మండల కేంద్రమైన పుల్లలచెరువులో మండల విస్తృత సమావేశం బుధవారం రైస్ మిల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఎన్నికల ముందు అలివికాని హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆ హామీలను అటకెక్కించటం చంద్రబాబు నాయుడుకు అనాదిగా వస్తున్న ఆచారం అని అన్నారు. కూటమి ప్రభుత్వం మోసం చేసి గెలిచిన తర్వాత రాష్ట్రంలో అక్రమాలు, అన్యాయాలు, అఘాయిత్యాలు అరెస్టులు పాలన చేస్తుందన్నారు. 25 లక్షల మంది పేద ప్రజలకు పక్కా గృహాలు కట్టించిన ప్రభుత్వం జగన్ ప్రభుత్వం అని అన్నారు. తల్లికి వందనం అంటూ అర్హులైన తల్లులకు పథకాలు ఇవ్వకుండా పంగనామాలు పెట్టారన్నారు. దీపం పథకంలో సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్తే ఆ దీపం వెలగకుండానే ఆరిపోయిందని ఎద్దేవా చేశారు. పథకాలు పేరుతో అప్పులు, హామీలు పేరుతో అప్పులు, అమరావతి పేరుతో అప్పులు మీద అప్పులు చేయడం, అప్పులకు వడ్డీలు కట్టడానికి మళ్ళీ అప్పులు చేయడం తెచ్చిన డబ్బు ఎక్కడ అంటే సమాదానం చెప్పకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో కూడా 100శాతం సంక్షేమ పథకాలు అమలు చేసిన గత ప్రభుత్వం కంటే ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకుండా 52శాతం పైగా అప్పులు చేసి ఆడబ్బు ఏంచేస్తున్నారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని నిలదీశారు. మరో నాయకులు పిఠాపురం పీఠాధిపతైన పవన్ తన సొంత జిల్లాలో మహిళకు అన్యాయం జరిగితే మాట్లాడరు కానీ పక్క రాష్ట్రాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు. ఇస్తున్నారన్నారు. ఆయన జిల్లా లో ఆడపిల్లకు అన్యాయం జరిగితే మాట మాత్రం మాట్లాడలేదని ఎవరైనా ప్రశ్నిస్తే తోలు తీస్తా, నారతీస్తా అంటారని అన్నారు. తమ జీవితాంతం వైఎస్ జగనన్నతోనే తమ పయనం ఉంటుందని నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పొదిలి పర్యటనలో టీడీపీ వాళ్ళ తప్పులు చేస్తే దాచి పెట్టి అమాయకులను జైల్లో పెట్టారన్నారు. గుడివాడలో బీసీ మహిళా జడ్పీ చైర్ పర్సన్ పై దాడి చేస్తే మహిళా హోంమంత్రి అయి బాదితురాలి పైనే కేసులు పెట్టించడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఈవీఎంల ద్వారా అధికారంలోకి వచ్చారని ప్రజల హృదయాల్లో మాత్రం జగనన్నే ఉన్నారని అందుకే టీడీపీ కి భయం పట్టుకుని అధికారులను అడ్డుపెట్టి మన జనాలు రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ధైర్యంగా పోటీ చేసి మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 8కి 8అసెంబ్లీ స్థానాలు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. 2014లో బాబు మోసాలు చూశామని, 2024లో కూడా బాబు మోసగాడని నిరూపణ అయ్యిందన్నారు. పవన్ కళ్యాణ్ మార్కాపురంలో నిర్వహించిన సభలో 15 ఏళ్ళు కూటమి ప్రభుత్వంలో ఉంటామని చెప్పడమే జగనన్న అంటే వాళ్ళకు పట్టుకున్న భయాన్ని స్పష్టం చేస్తుందన్నారు. జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి ఈవీఎంల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమికి ధడపట్టుకుందని చెప్పారు.

విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద ప్రజాసంఘాల ధర్నా

విశాలాంధ్ర - దుగ్గిరాల : మండలంలోని దుగ్గిరాల రైలుపేటలో ఉన్న విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద బుధవారం ప్రజాసంఘాలు,ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్యంగా స్మార్ట్ మీటర్లు బిగించడానికి వ్యతిరేకిస్తూ ధర్నా జరిపి అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. జెట్టి బాల రాజు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల్లో సర్దుబాటు చార్జీల పేరుతో ట్రూ ఆఫ్ చార్జీలతో ప్రజలపై భారాలు వస్తున్నారు. సీపీఐ నాయకులు షేక్ కరిముల్లా మాట్లాడుతూ విద్యుత్ సాయంత్రం వేళల్లో కోతల పెడుతున్నారని, బిల్లులు అధికంగా వస్తున్న యన్నారు. ఈ కార్యక్రమంలో నడకుదురు యోగేశ్వరరావు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ, ఏ. పాములు, షేక్ నాగుల్ మీరా, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన పేరేచర్ల గ్రౌండ్ నందు సీనియర్ బాయ్స్ కేటగిరి సంబంధించి గుంటూరు జిల్లా ఫుట్బాల్ సెలక్షన్స్ జరుగుతున్నా యని గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, స్టేట్ జాయింట్ సెక్రటరీ కుమ్మర క్రాంతికుమార్, జిల్లా సెక్రటరీ దుర్గా మోహన్ బుధవారం తెలియజేసారు. ఈ సెలెక్షన్స్‌లో ఎంపిక యినవాళ్లు ఈ నెల 9న బాపట్లలో జరగబోయే నల్లమల జోన్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొంటారని, అక్కడ కూడా నల్లమల జోన్ టీమ్ ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. బాపట్లలో నల్లమల జోన్ టీమ్‌కు ఎంపిక అయినా వారు ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో జరగబోయే సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మెన్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్-విశాఖపట్నంలో ఈ నెల 16,17 తేదీ లలో జరగబోయే టోర్నమెంట్‌లో పాల్గొంటారని క్రాంతికుమార్ తెలియజేసారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనేవారు శుక్రవారం మధ్యాహ్నం 2:00 గంటలకు పేరేచర్ల గ్రౌండ్‌లో (964293 1771) రిపోర్ట్ చేయాలని తెలిపారు.

రైతులు ఈ -పంటను నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - దాచేపల్లి: ఖరీఫ్ సీజను నేపధ్యంలో రైతులు తమ పొలాల్లో పండిస్తున్న పంటను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ కంచర్ల వెంకటేష్ కోరారు. బుధవారం ముత్యాలంపాడు గ్రామంలో పొలం పిలు స్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కం చర్ల మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేస్తేనే ప్రభుత్వ పరంగా ప్రయోజనాలు చేకూరు తాయన్నారు.అదేవిధంగా బీమా చేయించుకోవాలని పేర్కొన్నారు.

ముమ్మరంగా ఎస్టీయూ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-దాచేపల్లి: ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని దాచేపల్లి మండలం అంతటా ముమ్మరంగా పూర్తి చేశారు. దీనిలో భాగంగానే బుధ వారం దాచేపల్లి, పెదగార్ల పాడు ప్రాంతాల్లో ఆశాఖ ఉపాధ్యాయుల కొత్త సభ్యత్వాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ కోశాధికారి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు, ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు లింగిరెడ్డి వెంకట్రామిరెడ్డి, స్థానిక శాఖ ఉపాధ్యాయులు చెట్టిపోగు ఏసురత్నం, ఆతుకూరి వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస నాయక్, రమణారావు, రాజశేఖర్, సీహెచ్‌రాములు పాల్గొన్నారు.

అందరూ నిర్దోషులైతే హంతకులు ఎవరు?

- చుండూరు దళిత నరమేధానికి 34 ఏళ్లు
- బాధితులకు అందని 'న్యాయం'
- దళిత నేత నీలం నాగేంద్రరావు

విశాలాంధ్ర-ఒంగోలు : చుండూరు దళిత నరమేధంలో అగ్రకుల హంతకులు అందరూ నిర్దోషులైతే మరి హంతకులు ఎవరని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ రెడ్డి హంతకముఠా నరమేధం జరిపి 34 సంవత్సరములైన నేటికీ న్యాయం జరగలేదన్నారు. బుధవారం స్థానిక సమితి కార్యాలయంలో నీలం నాగేంద్రం మాట్లాడుతూ అప్పటి గుంటూరు జిల్లా చుండూరులో విద్యావంతులు ఉద్యోగస్తులు అధికంగా నివసించే చుండూరు మాలపల్లిపై చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రెడ్డి, కాపు అగ్రకుల హంతకముఠ పోలీసుల సాయంతో మారణకాండ సృష్టించి 8 మంది మాలలని ఊచకోత కోశారన్నారు. చుండూరు మారణకాండపై చుండూరులోనే ప్రత్యేక కోర్టు 56 మందికి శిక్షలు పడ్డాయి అన్నారు. వీరిలో 21 మందికి జీవిత ఖైదు మరియు 31 మందికి ఒక సంవత్సరం విధించారు అన్నారు. చుండూరు మారణకాండ పై ఏర్పాటుచేసిన ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు అగ్రకుల హంతకులకు ఎస్సీ ఎస్టీ యాక్ట్ ప్రకారం శిక్షలు విధించకపోవడం అగ్రకుల రాజకీయ మరియు మనువాద న్యాయవ్యవస్థకు నిదర్శనం అన్నారు. 1991లో చుండూరు మారణకాండ జరిగితే 16 ఏళ్ల తర్వాత 2007లో వచ్చిన న్యాయ వ్యవస్థపై భ్రమలు కల్పించే ఈ తీర్పును కూడా హైకోర్టు కొట్టివేస్తూ చుండూరు అగ్రకుల హంతకులందరూ నిర్దోషులేనని తీర్పునిచ్చి అగ్రకుల రాజ్య వ్యవస్థ అగ్రహారం తీర్పును వెలువరించింది అన్నారు. మరలా చుండూరు దళిత పోరాట బాధితుల కమిటీ సుప్రీంకోర్టులో కేసు వేసి న్యాయం కోసం సుదీర్ఘ పోరాటం చేస్తుందన్నారు. చుండూరు దళిత ఉద్యమం సామాజిక సాంఘిక సాంస్కృతిక ఉద్యమాలకు జన్మనిచ్చిందన్నారు. దళితులకు వజ్రాయుధమైన ఎస్సీ ఎస్టీ యాక్ట్ ను తీసుకొచ్చిందన్నారు. చుండూరు దళితుల రక్తపు ధారలే జాతీయ ఉద్యమంగా మారి దేశవ్యాప్త దళిత ఉద్యమాలకు చుండూరు దిక్సూచిగా నిలిచిందని దళిత కుల పరిక్ష సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర చుండూరు మృత వీరులకు నివాళులు అర్పించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి పిల్లి మాల్యాద్రి ఉన్నారు.

ధ్వంసం చేసిన ఇళ్ల బాధితులకు బొల్లా ఆర్థికసాయం

విశాలాంధ్ర - వినుకొండ : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులు ధ్వంసం చేసిన ఇళ్ల బాధితులకు ఆర్థిక సాయం అందించిన కార్య క్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పిఏసి మెంబర్, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ. వినుకొండ పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో, బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో నివాసం ఉంటున్న సుమారు పది కుటుంబాల వారి నివాస గృహాలను హై కోర్ట్ ఆర్డర్ పేరుతో టిడిపి నాయకులు, అధికారులు అన్యాయంగా కూల్చేసిన ఇళ్లు, వ్యాపార సముదాయాల కారణంగా జీవితాలు దెబ్బతిన్న నిరుపేద కుటుంబాలకు నిజమైన అండగా నిలిచింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధితులకు ఆర్థిక సహాయం కింద రూ. 5 లక్షల అందించిన వైఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పిఏసి మెంబర్ వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తుందని, పేద ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఇక్కడ చిప్ విప్ ఆంజనేయులు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులమీద పెట్టిస్తున్న అక్రమ కేసులమీద ఉన్న శ్రద్ధ వినుకొండ నియోజకవర్గ అభివృద్ధి పై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, బొల్లాపల్లి మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పొగాకు అనర్థాలపై అవగాహన

విశాలాంధ్ర - దుగ్గిరాల : పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారు ఆ వ్యసనం నుంచి బయటపడి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని కెఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. కేంద్ర యువజన వ్యవహారాలు, స్పోర్ట్స్ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కెఎల్‌యు ఎన్ఎస్ఎస్ ఎంసీపీ విభాగం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు గ్రామంలో బుధవారం పొగాకు ఉత్పత్తుల వలన కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. సిగరెట్, బీడీ, గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులు వాడకం వలన నోరు, గొంతు తదితర అవయువాలకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, గుండె, ఊపిరితిత్తులకు అనారోగ్య సమస్యలు వస్తాయని ఎంసీపీ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్.కిరణ్ కుమార్ వివరించారు. ఆ వ్యసనం నుంచి బయటపడాలంటే పొగాకుని మానాలనే ధృఢమైన నిర్ణయంతోపాటు నికోటిన్ రీప్లేస్ మెంట్ థెరపీ తీసుకోవటం, కుటుంబ సభ్యుల మద్దతు తీసుకోవటం చేస్తే పొగాకు ఉత్పత్తుల వ్యసనం నుంచి బయటపడవచ్చునని విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ తెలియపరిచారు. ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఉషారాణి, వాలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థ సారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, కె.రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి తదితరులు అభినందించారు.

వేపకంపల్లె ఎంపీటీసీ ఉప ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర - కారంపూడి : మండల పరిషత్ టెరిటోరియల్ కాన్‌స్టిట్యూ యెన్సీ (ఎంపీటీసీ) వేపకంపల్లె ఉప ఎన్నికలో పోటీ లేకుండా బోల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావు విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిద్ద లింగమూర్తి ప్రకటించారు. ఈసీ బోల్నేడి కనకదుర్గ శ్రీనివాస రావుకు డిక్లరేషన్ ధ్రువీకరణ పత్రాలను బుధ వారం అందచేశారు. ఈ ఉపఎన్నికలో ఇద్దరు అభ్యర్థులు మాత్రమే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన అనం తరం, ఒకరు గడువు ముగియకముందే తన అభ్యర్థిత్వాన్ని వెనక్కి తీసుకోవడంతో ఉప ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు. దీంతో మిగిలిన ఒక్క అభ్యర్థి పేరును ఎన్నికల నియమావళి ప్రకారం రిటర్నింగ్ ఆఫీసర్ నేరుగా ప్రకటించారు.

ఓరుగంటికి విశ్వజనని సేవారత్న అవార్డు

విశాలాంధ్ర - మాచర్ల : విశ్వజనని ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మ కంగా ప్రదానం చేయనున్న "విశ్వజనని సేవారత్న" అవార్డుకు పట్టణానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త సీనియర్ జర్నలిస్ట్ ఓరుగంటి చెన్నకేశవరావు ఎంపికయ్యారు. ఫౌండేషన్ 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 20న హైదరాబాదులోని నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అవార్డుల ప్రదానం జరగనుంది. ఓరుగంటి చెన్నకేశవరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వివిధ తెలుగు దినపత్రికలలో రిపోర్టర్‌గా పని చేస్తూ, లయన్స్ క్లబ్, వాసవి క్లబ్, ఆవోపా, ఆర్యవైశ్య సంఘాల ద్వారా వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ, వివిధ దేవాలయాల్లో భక్తులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి విశ్వజనని ఫౌండేషన్ తనకు విశ్వజనని సేవారత్న అవార్డు ఎంపిక చేయ డం సంతోషంగా ఉందన్నారు.ఈసందర్భంగా చెన్నకేశవరావుకు అభిమానులు, మిత్రులు, జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

తల్లిపాల వారోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - విను కొండ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవంపై అంగన్వాడీలు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కలిగి ఉండాలని వినుకొండ పట్టణంలోని కట్టకింద బజార్ సచివాలయం పరిధిలో ఉన్న అంగన్వాడి సెంటర్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఏ సెక్టార్ అంగన్వాడి సూపర్వైజర్ శేష కుమారి సూచించారు. అంగన్వాడి నుండి గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహారాన్ని సమయానికి అందుకొని, సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు ఇవ్వాలని, బిడ్డకు ఎంత ముఖ్యమో చిన్నారుల ఆరోగ్య క్షేమం కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రభుత్వం అందించే పాలు, గుడ్లు, బాలామృతం తప్పనిసరిగా చిన్నారులకు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు షేక్.రజియా, షేక్.నీలిమ, షేక్.జాన్ బి, వై.నీరజ, అంగన్వాడి సిబ్బంది, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టించాలి

విశాలాంధ్ర - పెదకూరపాడు : పుట్టిన పిల్లలకు ముర్రు పాలు పట్టించాలని, బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ఎంత అవసరమని సీహెచ్‌వో అనుపమ అన్నారు. మండల కేంద్రమైన పెద్దకూరపాడు 5, 6 వార్డులలో బుధవారం ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పర్యటించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు ముర్రు పాలు అందించడం వల్ల లాభాలను వివరించారు. ఏఎన్ఎం అనూష, సాయి తిరుమల, అంగ న్వాడీ కార్యకర్త సామ్రాజ్యం, ప్రవంతి, ఆశాకార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఆ ఊళ్లో గ్రంథాలయం..?



- మళ్లీ పూర్వవైభవం తీసుకోరావాలి
- బస్టాండ్‌లో ఓ గది, బల్లలు సిద్ధం
- విద్యార్థులు,యువతకు ఎంతో మేలు
- పోటీ పరీక్షల పుస్తకాలు ఉంచాలి
- దాతలు సహకరించాలి
- గ్రామీణ యువతకు, వృద్ధుల ఆసక్తి

నిరుపయోగంగా ఫర్నిచర్

విశాలాంధ్ర - సంతమాగులూరు : అనగనగా ఆ ఊళ్లో ఓ గ్రంథాలయం ఉండేది.ఆ ఊరు పేరు ఏల్చూరు. గ్రామానికి చెందిన నాటితరం యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి,వారి పర్యవేక్షణలో వందలాది పుస్తకాలు,రోజువారీ దినపత్రికలను సమకూర్చారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులు,విద్యార్థులతో కొంతకాలం పాటు ఓ వెలుగు వెలిగింది.ప్రతిరోజూ ఉదయం,సాయం కాలం వేళల్లో లైబ్రరీ తలుపులు తెరచుకునేవి.ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు పుస్తక పఠనం చేసేందుకు ఆసక్తి కనబరుస్తూ గ్రంథాలయానికి వస్తూ ఉంటారు. కొన్నాళ్లకు ఆ యువత జీవన గమనంలో మార్పులు అనివార్యమయ్యాయి.తమ వ్యక్తి గతంగా ఉద్యోగ ప్రయత్నాలు,పలు కారణాల రీత్యా ఇతరత్రా ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చింది.ఈ తరుణంలో నేనున్నా అంటూ అదే గ్రామంలోని వీఆర్యే అయిన చిరుద్యోగి షేక్ షఫీ గ్రంథాలయానికి నడిపించే బాధ్యతలను తన భుజస్కందాలపై వేసుకున్నారు.ఆ స్థాయిలో కాకపోయినా,కొంతవరకు తన సొంత డబ్బులు వెచ్చించి, దాతల సహకారంతో దినపత్రికలను తెప్పించేవారు.

బస్టాండులో అపరిశుభ్రత

ఇంకొన్నాళ్ల పాటు నడిపించారు.ఆ తర్వాత నిర్వహణకు దాతల సహకారం కొరవడటంతో గ్రంథాలయం మూతపడింది.నిత్యం పిల్లలు, పాఠకులు, ఔత్సాహికులతో కలకలలాడుతూ జ్ఞానం అనే వెలుగులు నింపే గ్రంథాలయం తలుపులు నేటికీ తెరుచుకోలేదు.ఈ దయనీయ పరిస్థితి సంతమాగులూరు మండలం ఏల్చూరులో నెలకొంది.

○ పిల్లలు, యువతకు ఉపయోగం :

ఏల్చూరులో సుమారు వెయ్యి మంది విద్యార్థులు ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలో విద్య అభ్యసిస్తున్నారు.వారే కాకుండా చదువులు పూర్తి చేసుకుని కొలువుల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత చాలామంది ఉన్నారు.వారిలో ఆర్థిక స్థోమత ఉన్నవారు వివిధ కోచింగ్ సెంటర్లలో తర్ఫీదు పొందుతూ పోటీ పరీక్షలకు హాజరవుతున్నారు.మరికొందరు ఇంటి వద్దే పనులు చేసుకుంటూ సిద్ధమవుతుంటారు. అలాగే విద్యార్థులకు తరగతి గదిలో చెప్పే పాఠాలతో పాటు నేటి పోటీ ప్రపంచంలో సమకాలీన అంశాలపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని చెప్పాలి. గ్రామంలో గ్రంథాలయం అందుబాటులోకి వస్తే వారందరికి ఎంతోకొంత మేలు జరుగుతుంది.అదేవిధంగా డిజిటల్ రంగంలో ప్రింట్ మీడియాపై ఏమాత్రం తీసిపోదు.నేటికీ ప్రపంచంలో జరిగే సంఘటనలను తెలుసుకునేందుకు పాఠకులు, ఔత్సాహికులు ఉన్నారంటే అతిశయోక్తికాదు.ఉదయం నిద్ర లేవగానే దినపత్రికలు చదివే అభిరుచి ఉన్న వ్యక్తులు ఏల్చూరులో చాలామంది ఉన్నారు.వారు కూడా గ్రంథాలయానికి మళ్లీ పునఃప్రారంభం చేస్తే బాగుంటుందని చాలా యువత,ప్రజలు కోరుతున్నారు.

○ ఖాళీ కుర్చీలు,బల్లలతో అపరిశుభ్రతతో దర్శనం :

ఏల్చూరు బస్టాండులోని ఓ వైపు ఉన్న గదిని గతంలో లైబ్రరీకి కేటాయించారు.కొన్నాళ్లు తర్వాత నిర్వహణ కష్టతరంగా మారడంతో మూసివేశారు. ప్రస్తుతం గదిలో దాతలు సమకూర్చిన కుర్చీలు,బల్లలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.అంతేకాకుండా రాత్రివేళల్లో అక్కడికి మందుబాబులు చేరి మద్యం తాగడంతో అపరిశుభ్రత నెలకొంది.

గ్రామంలో ఉన్న పెద్దలు, విద్యావంతులు, పూర్వ విద్యార్థులు అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందజేస్తే లైబ్రరీ తెరచు

○ దాతలు ముందుకు రావాలి :

కుంటుంది.లైబ్రరీ గదిలో మౌలిక సదుపాయాల కల్పనకు, కాంపిటీషన్ పుస్తకాలు,నిఘంటువులు,దినపత్రికలకు చందాలు చెల్లింపు ఇలా ఏ రూపంలో అయినా సరే చేయూతనిస్తే ఏల్చూరు లైబ్రరీకి మళ్లీ పూర్వ వైభవం రావడం ఖాయం.అందుకు తనవంతు కృషి చేస్తానని గతంలోని గ్రంథాలయ నిర్వాహకులు షేక్ షఫీ (వీఆర్యే) చెప్పారు.అదేవిధంగా పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని,అవసరమైతే మందు బాబులకు జరిమానా విధించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరేపల్లి,తూర్పుపాలెంల్లో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - చెరుకుపల్లి : నాట్లు వేస్తున్న రైతులు నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చగా ఉంటేనే మొవ్వ త్వరగా పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ అన్నారు.బుధవారం ఆరేపల్లి,తూర్పుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ నాలుగు నుండి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలన్నారు.ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది అన్నారు.నారుపై పైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంది అన్నారు.నాటు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ఖరీఫ్లో చదరపు మీటరుకు 33 కుదుళ్ళు ఉండేలా చూసుకోవాలని అలాగే బరువైన నేలల్లో దమ్ము చేసిన రెండు నుండి పది రోజులలోపు నాట్లు వేయటం మంచిదన్నారు.నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల బాటలు తీయాలన్నారు.ఈ బాటలు తీయడం వలన పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఒదిరితే కొంత వరకు తగ్గుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బీడీ రామకృష్ణ,తూము ప్రేమ్ కుమార్ గ్రామ వ్యవసాయ సహాయకులు కే.శివశంకర్,ప్రకృతి వ్యవసాయం నుండి రాహేల్ బాబు సురేష్, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవం

విశాలాంధ్ర- చీమకుర్తి: మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలోని చీమకుర్తి మండలం లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో టీడీపీఓ పీఆర్ ఇవాంజిలిన్ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం చీమకుర్తిలోని విద్యానగర్,కొత్త కుమ్మరి పాలెం, బంగారమ్మతోపు, సచివాలయంలో తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను గురించి తెలియ చెప్పడం జరిగింది. సెక్టార్ సూపర్వైజర్ సి.హెచ్. శైలజ, యు.పి.హెచ్ సి. డాక్టర్ ఎమ్.బేబీ శ్రీ , ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ దశను మార్చిన చుండూరు మారణకాండ

- దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మాచవరపు జూలియన్

విశాలాంధ్ర - చీరాల : భారతదేశంలో దళిత ఉద్యమ దశను దిశను మార్చిన చుండూరు మారణకాండలో తెగిపడ్డ దళితుడు చేయి సామాజిక న్యాయం కోసం నేటికీ ప్రశ్నిస్తూనే ఉందని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మాచవరపు జూలియన్ అన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన చుండూరు మృతవీరుల 35వ సంస్మరణ సభలో జూలియన్ మాట్లాడుతూ సామాజిక అస్పృశ్యత,ఆర్థిక అణచివేతగా మారిందన్నారు. 1991 ఆగస్టు 6న చుండూరులో ప్రభుత్వం,పోలీసు,అగ్రకులాల కుట్ర నేపథ్యంలో జరిగిన చుండూరు మారణకాండకు చుండూరు మాల, మాదిగలు, చదువుకోవటం,100కుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందటం,స్వతంత్రంగా జీవించటమే కారణమన్నారు.ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు వ్యాపారాలతో స్థిరమైన ఆదాయం సమకూరుతుండడంతో,దళితులు రెడ్లు, తెలగాల భూములు కౌలుకు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకునే దశలో ఉండటం కూడా మరో కారణమన్నారు.రిజర్వేషన్ కోటాలో చుండూరు మండలాధ్యక్ష పదవి ఎస్సీలకు దక్కటం,సామాజిక అసమానతలపై దోపిడీపై దళిత విద్యావంతులు ప్రశ్నించటంతో రెడ్లు తెలగాలు మూకుమ్మడి దాడికి తెగబడ్డారన్నారు.వారికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అండ, పోలీసు సహకారం ఉందన్నారు.ఇళ్లల్లో ఉన్న దళితులను కుట్రపూరితంగా బయటకు రప్పించి,ప్రాణ భయంతో పారిపోతున్న 8 మంది దళితులను ఊచకోత కోశారన్నారు.గోతాల్లో కుక్కి తుంగభద్ర కాలవలో వేశారన్నారు.మూడు రోజుల తర్వాత శవాలు దొరికాయని,35 సంవత్సరాలైనా సంపూర్ణ న్యాయం దక్కలేదని జూలై ఆవేదన వ్యక్తం చేశారు.చుండూరు మారణ హోమం తర్వాతే,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టం వచ్చినందువల్లే దళితులు దేశంలో ఎంతో కొంత రక్షణ దొరుకుతున్నదన్నారు.వర్గ శత్రువు పట్ల నిరంతరం మెళుకువగా ఉండాలని చుండూరు మారణకాండ దళిత సమాజానికి హెచ్చరిక చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో దిలీప్ కుమార్,మల్లెల రత్నం,బుల్లిబాబు, రేవంత్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయిలు వెంటనే చెల్లించాలి



విశాలాంధ్ర - రేపల్లె : ఉద్యోగు లకు, ఉపాధ్యాయులకు,పెన్షనర్లకు ప్రభుత్వం నుండి రావలసిన డిఎ,ఐఆర్,పిఆర్సి బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీజిఇఏ యూని యన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు రోశయ్య డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏపీజిఇఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి రమేష్ కుమార్ ఆదేశాల మేరకు రేపల్లె మున్సిపల్ కా ర్యాలయంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే వినూ త్న కార్యక్రమాన్ని రోశయ్య, కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు నిర్వహించారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్ష నర్ల సమస్యల గురించి తెలియజేశారు. సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యం

విశాలాంధ్ర - పర్చూరు : బిడ్డకు తల్లిపాలతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర తెలిపారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం పర్చూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గర్భవతులకు,బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.సిడిపిఓ మాట్లాడుతూ తల్లిపాలు దేవుడిచ్చిన వరమని,మురుపాలలో పోషక విలువలు ఉండడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. తల్లులు పాలివ్వడం ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ మరియు డయాబెటిస్ రాకుండా ఉంటుందని తెలియజేశారు.సిహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ మొదటి గంటలోనే పాలను ప్రతి తల్లి తన బిడ్డకు అందజేయాలని తద్వారా బిడ్డ,తల్లి అనుబంధం పెరుగుతుందని కంగారు మదర్ పద్ధతిని పాటించాలని తెలిపారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ దీపాదేవి,అంగన్వాడి కార్యకర్తలు, హెడ్ నర్స్,హాస్పటల్ స్టాఫ్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



విశాలాంధ్ర - అద్దంకి : ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని బాపట్ల జిల్లా సహిత విద్య సమన్వయకర్త మట్ట జోత్స్న అన్నారు.బుధవారం స్థానిక సత్రం బడి ఆవరణలో ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. జ్యోత్స్న మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆ లింకు సంస్థ ద్వారా ఉచితంగా ఉపకారణాలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో నాలుగు మున్సి పాలిటీలకు ఆటిజం సెంటర్లు మంజూరైనట్లు తెలిపారు వైద్యులు ప్రియా వర్మ,తుషార్ వర్మ చిన్నారులకు ఉపకరణాల నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వ హించారు.బల్లికురవ ఎంఈఓ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు ధన లక్ష్మి,బాబురావు,కొంగల శ్రీను,పాలపర్తి యోనా,ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

గోశాలకు ఆర్థిక వితరణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎన్. ఆర్. అండ్.పీ.ఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ మద్దు వెంకట సుబ్బారావు మహాదేవ వేద గోశాలకు గోవుల పోషణ నిమిత్తం రూ.5,005లు నగదు వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్,నారాయణమూర్తి,వీరాంజనేయులు,చెక్కా నారాయణ,వాకింగ్ సభ్యులు,గోశాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయపురంలో చోరీ

విశాలాంధ్ర - బల్లికురవ : బల్లికురవ మండలంలోని రామాంజనేయ పురంలో మంగళ వారం అర్ధరాత్రి సమయంలో గుంటుపల్లి గురుమూర్తి ఇంటిలో గుర్తు తెలియని దొంగలు ఇంటిలోనికి ప్రవేశించి బీరువా పగులుగొట్టి,బీరువాలోని మూడు సవర్ల బంగారు ఆభరణాలు,30 తులాల వెండి ఆభరణములు, రూ. 1500ల నగదు దొంగిలించారు.సదరు సంఘటన స్థలమును సంతమాగులూరు ఇనిస్పెక్టర్ కె.వెంకటరావు,బల్లికురవ ఎస్సై వై.నాగరాజు సందర్శించారు. సదరు సంఘటనపై బల్లికురవ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆక్రమణదారులకు నోటీసులు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఏల్చూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రోడ్లు ఆనుకుని అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు. బుధవారం ఈమేరకు కార్యదర్శి పూర్ణచంద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ప్రధాన రహదారి వెంట ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గ్రామంలోని కొందరు ఆక్రమించి, దుకాణాలు ఏర్పాటు చేశారు.ఇది చట్టరీత్యా వ్యతిరేకం,పంచాయతీ ఆదాయానికి గండి కొట్టడమే,ఈ విషయాన్ని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.వారి ఆదేశాలు మేరకు ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.దీనిపై వారి నుంచి స్పందన రాకుంటే ఉన్నతాధికారుల సూచనలు మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మండలంలోని పుండ్ల గ్రామంలో గతంలో ప్రభుత్వ భూమిని 9మంది రైతులకు సాగు చేసుకునేందుకు భూమిని అందజేసి రైతులకు పట్టాలు మంజూరు చేసింది.అప్పటి నుంచి రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు.ఇటీవల హద్దుల వద్ద రైతులకు సమస్య రావడంతో కొందరు రైతులు హద్దులు చూపించి సమస్యను పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలతో బాపట్ల తహసీల్దార్ షాలీమా,సర్వే లక్ష్మీనారాయణ సిబ్బంది పుండ్ల గ్రామంలోని రైతులకు ఇచ్చిన భూములను పరిశీలించి రైతులకు ప్రధాన సమస్య అయిన హద్దుల సమస్యను పరిష్కరించారు.రైతులకు చెందిన పొలాల హద్దు రాళ్ళు వేయించారు.రానున్న రోజుల్లో ఎటువంటి చిన్నపాటి సమస్య లేకుండా సమస్యను పరిష్కరించడంతోపాటు అధికారులకు గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.తహసీల్దార్ మాట్లాడుతూ మండల,పట్టణ ప్రజలకు సమస్యలు ఏమైనా ఉన్నా సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు.సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు.

మృతుల కుటుంబాలకు నష్టం పరిహారం చెల్లించాలి

గ్రానైట్ క్వారీ ప్రమాదంపై కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలోని సత్య కృష్ణ క్వారీలో ప్రమాదానికి గురై మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, గాయపడిన వారికి రూ.20 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం బల్లికురవ సెంటర్లో కరపత్ర ఆవిష్కరణ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఐటీయూ తంగిరాల వెంకటేశ్వర్లు ఎంఈ ఫౌండేషన్, హరిహర రెడ్డి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాలు దాటి పొట్ట చేత పట్టుకొని వచ్చిన కార్మికులకు ఇక్కడ ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన క్వారీ యాజమాన్యం,మైనింగ్ పోలీసు కార్మిక శాఖ అధికారులు అలాంటి ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకోకుండా ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేసి చేతులు దులుపుకునే పరిస్థితి జరుగుతుందన్నారు. ఈ ప్రమాదంలో చాలా అనుమానాలకి తావిస్తుందని,ఇది చాలా పెద్ద ప్రమాదం జరిగి ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ప్రచారం జరుగుతుందని,ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందో దీన్ని నిగ్గు తేల్చాల్సిన బాధ్యత అధికారులపైన ఉంది కాబట్టి వెంటనే దీన్ని ప్రత్యేక దర్యాప్తు సంస్థతోటి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం .ఈ విషయమై రేపు తేదీ 7.8.20.25 తేదీన బల్లికురలో కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, బల్లికురవ క్వారీల్లో పనిచేసే కార్మికులకు భద్రత లేకుండా పోవడం పైన అవగాహన సదస్సు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు,వ్యవసాయ కార్మిక సంఘం,ఏఐటియుసి, ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : డెంగ్యూ,వైరల్ ఫీవర్ తదితర సీజనల్ వ్యాధుల పట్ల మండల అధికారులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని అన్నారు.జిల్లా పరిపాలనాధికారి ఆదేశాల మేరకు మండలంలో ఉన్న మెడికల్ ఆఫీసర్లు,ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇతర సచివాలయ సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎం,ఆశా వర్కర్లు,పంచాయితీ కార్యదర్శులు ప్రతి ఇంటిని సందర్శించి సీజనల్ వ్యాధుల పట్ల వారికి అవగాహన కల్పించాలన్నారు.జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేసి వైద్య సహాయం అందించాలన్నారు.ఆర్ఎంపీల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో దోమల నివారణకు విస్తృతంగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు.అన్ని వీధులలో బ్లీచింగ్ చల్లించాలన్నారు. మురుగు కాలవల్లో పేరుకుపోయిన చెత్తను తీసి మురుగునీరు సక్రమంగా పారేలా చూడాలన్నారు.దోమల నివారణకు గ్రామంలోని వీధులన్నిట ఫాగింగ్ చేయించాలన్నారు.దోమల లార్వా నివారణకు ఆయిల్ బాల్స్ నీరు ఉన్న ప్రదేశాలలో వదలాలన్నారు.డెంగ్యూ దోమలు మంచినీటిలో పెరుగుతాయి. కావున తాగేసిన కొబ్బరి బొండాలు,వాడేసిన టైర్లు,ఉపయోగించని బకెట్లు,డబ్బాలలో ఉన్న నీటిని తొలగించాలన్నారు.తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సీజనల్ వ్యాధులను ప్రబలకుండా చూడాలన్నారు.

రేణింగవరంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రేణింగవరం,కశ్యపురము గ్రామాలలో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి పాల్గొని పొలం పిలుస్తుంది ముఖ్య ఉద్దేశం వివరించారు. అన్నదాత సుఖీభవ పథక అర్హులు అందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని,ఆధార్ తప్పుగా నమోదు అయిన వారికి తహసీల్దార్ కార్యాలయంలో సరి చేసుకున్నట్లయితే వారికి కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాయికృష్ణ, నాయకులు ఓబుల్ రెడ్డి,నారాయణస్వామి, నాగేశ్వరావులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరికలు

వైసీపీకి చెందిన ఇద్దరు సర్పంచులు,ఒక కాపు నేత టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - మార్టూరు : గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను ఆకర్షించడానికి ఇచ్చిన హామీలన్నీ మోసమేనని,చివరికి వైసీపీపై విశ్వాసం ఉంచిన ప్రతి ఒక్కరూ మోసపోయారని పేర్కొన్నారని,ఆ పార్టీ కార్యకర్తల విశ్వాసం సైతం కోల్పోయిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం మార్టూరు మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో వైసీపీ నేతలు భారీగా టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఏలూరి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే అన్ని ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా వచ్చే అవకాశం లేదన్నారు.గత ఐదేళ్ల వైసీపీ విధ్వంస అరాచక దౌర్జన్య పాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారన్నారు.వైసీపీ పాలనలో సొంత గ్రామాలను కూడా అభివృద్ధి చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.అధికార పార్టీ పదవుల్లో ఉన్న నేతలకే ఈ స్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు.శక్తికి మించి కష్టపడిన కార్యకర్తలు, నాయకులను కూడా ఆ పార్టీ పట్టించుకోలేదని విమర్శించారు.టీడీపీ వైపు ఆకర్షితమవుతున్న వైసీపీ నేతలు,పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు గౌరవం ఇస్తామన్నారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి,ఎటువంటి లాభాపేక్ష లేకుండా వైసీపీ నేతలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని తెలిపారు.ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నామని,గ్రామాల సర్వతోముఖ అభివృద్ధి తమ లక్ష్యమని స్పష్టం చేశారు.అలాగే,పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. పార్టీల వివక్ష లేకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామన్నారు.అభివృద్ధే మా ఏకైక లక్ష్యం అని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

15లోపు రైతన్నలు ఇన్సూరెన్స్ ప్రీమియంను చెల్లించాలి

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని అరవపల్లి,నల్లూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఏ.మహేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి రైతు తమ గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ-క్రాప్ లో పంటలు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు.అలాగే వరి పంటకు సంబంధించి ఇన్సూరెన్స్ ప్రీమియంను ఆగస్టు 15 లోపు సిఎంఎస్‌సి కేంద్రాలలో చెల్లించుకోవాలని తెలిపారు.ఎకరానికి రూ. 800చెల్లించినచో మీరు రూ. 40000 భీమాకు అనుమతి పొందుతారన్నారు.కావున ప్రతి ఒక్క రైతు సోదరుడు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రైతు సేవ కేంద్రంలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా,పెండింగ్ జాబితా ఎన్‌పిసిఐ లింక్ జాబితా ప్రదర్శించబడుతున్నందున,రైతులు ఆ జాబితాలను పరిశీలించి,ఎన్‌పిసిఐ లింక్ లేని వారు తక్షణమే తమ బ్యాంకులో ఎన్‌పిసిఐ లింక్ చేయించుకోవాలి లేదా పోస్ట్ ఆఫీసులో కొత్త ఖాతా తెరవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు,గ్రామ వ్యవసాయ సహాయకులు వి.లక్ష్మణ సాయి,సుధీర్,గ్రామ నాయకులు,వీఆర్వోలు పాల్గొన్నారు.

బస్ జాతను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. శ్రీనివాస్

విశాలాంధ్ర -త్రిపురాంతకం: 28 వ రాష్ట్ర మహాసభలను పురస్క రించుకొని ఈనెల 9 తేదీ వైపాలెం నియోజకవర్గంలో జరుగు బస్ జాతను జయప్రదం చేయాలనీ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. త్రిపురాంతకం మండలంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఈనెల 20 నుండి రాష్ట్ర మహా సభలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా జిల్లా ప్రజలను చైతన్య చేసేందుకు బస్సు జాత ఏర్పాటు చేయడం జరిగింది. ఈజాత వైపాలెం నియోజ కవర్గం లోని పెద్దారవీడు నుండి మొదలై త్రిపురాంతకంలో ముగుస్తుంది. ఈ జాతలో కళాజాతకం బృందం ద్వారా అవగాహన కల్పిస్తూ నియో జక వర్గంలో విస్తృత ప్రచారం జరు గుతుంది. ఈ జాతలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు, సానుభూతి పాల్గొని జయ ప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. రాష్ట్ర మహా సభలలో జిల్లా అభి వృద్ధికి అవసరమైన పలు అంశాలపై చర్చించటం జరుగుతుంది. జిల్లాకు సంబంధించిన వెలుగొండ ప్రాజెక్టు కు 4 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించి వెలుగొండ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగు నీరు అందించా లన్నారు. దొనకొండ ను పారిశ్రామిక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురంను నూతన జిల్లాగా చేసి పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టేలా చర్యలు తీసుకోవడానికి తీర్మానం చేయడం జరుగుతుంది అన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాజాల రామయ్య, పట్టన కార్యదర్శి ఖాసీం, సీనియర్ నాయకులు వై టి ఆంజనేయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సీజనల్ వ్యాధులు పట్ల ప్రజల అప్రమతంగా ఉండాలని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివలీల అన్నారు. శివలీల ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని నందిరాజుతోటలో బుధవారం పర్యటించారు. అనంతరం కొన్ని గృహాలను సందర్శించి ఇంటి ముందు మురికి గుంటల కాకుండా ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం కొండుభొట్ల వారిపాలెం, పిన్నిబోయినవారి పాలెం, తూర్పు పిన్ని బోయినవా రిపాలెం, వెస్ట్ బాపట్ల, బేతపూడి, వెదుళ్ళపల్లి, స్టువర్ట్‌పురం గ్రామాలను కూడా సందర్శించి డెంగ్యూ తదితర విషజ్వరాలు గురించి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎంపిడిఓ బి. బాబురావు, డిప్యూటీ ఎంపీడీవో జి. రామకృష్ణ ఈస్ట్ బాపట్ల పంచా యతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : యువత మత్తు పదార్థాలకు అల వాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నిజాం పట్నం ఎస్సై కందుల తిరుప తిరావు హితవు పలికారు. ఈగల్ సెల్ ఐజీపీ ఆకే. రవికృష్ణ ఆదేశాల మేరకు నిజాంపట్నం పోలీసులు, ఈగల్ సెల్ బాపట్ల జిల్లా సిబ్బంది సంయుక్తంగా బుధవారం నిజాంపట్నం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో, మన భవిష్యత్తు మన చేతిలో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల పాత్ర ఎంతో గణనీయమైందన్నారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ అనే విషపు ఊపిరిని తీసుకుంటూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. డ్రగ్స్ శరీరానికి హానికరం మాత్రమే కాదని కుటుంబ, సమాజాన్ని తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. వీటిని ఒకసారి వాడటం మొదలు పెడితే మానడం చాల కష్టమన్నారు. డ్రగ్స్ వాడకంతో వచ్చే సమస్యలలో ముఖ్యమైనవి గుండె సంబంధిత, మానసిక వ్యాధులపై ప్రభావితం చేస్తాయన్నారు. కుటుంబాలు నేరాల బాటలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. దేశ అభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర ఉండాలంటే మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా వాటికి దూరంగా ఉండాలని సూచించారు. యువత, విద్యార్థులు తమ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాని కోసం కష్టసాధన చేసి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఎస్సై ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి. శివన్నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

విశాలాంధ్ర -పామూరు: గత ఐదు సంవత్సరాలుగాప్రజలకు సేవలు అందిస్తూ బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు బుధవారం సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ప్రజలకు చేసిన సేవలు ను మర్చిపోమని, బదిలీపై ఎక్కడికి వెళ్ళినా సేవలందించి అక్కడ ప్రజల మన్ననలు పొందాలని కోరారు. అదేవిధంగా బదిలీపై ఇక్కడికి వచ్చిన ఉద్యోగులు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల ప్రకారం పార్టీలు కు అతీతముగా సేవలందించి పంచాయతీ ప్రజల మన్ననలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పామూరు కస్టర్ కో కన్వీనర్ గోళ్ళ వీర బాబు, కంబాల దీన్నే గ్రామపంచాయతీ ప్రధాన కార్య దర్శి, ఏలూరి నరసింహారావు, గ్రామ సెక్రెటరీ హరి నారా యణ, మాజీ సన్మాన గ్రహీతలు డాక్టర్ సిద్దయ్య , వెల్ఫేర్ బ్రహ్మయ్య, అగ్రికల్చర్ రమేష్ , ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటరత్నం, సర్వేర్ హేమంత్, ప్రస్తుత డిజిటల్ అసిస్టెంట్ గౌస్య బేగం అగ్రికల్చర్ రామ శారద, వీఆర్వో దుద్దుకూరు శ్రీనివాసులు, సర్వేర్ నాగరాజు, వెల్ఫేర్ ఓంకారం, కరెంటు లైన్ మెన్ షేక్ సుభాని పాల్గొన్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర -పామూరు రూరల్: బాలింతలు, గర్భిణీ స్త్రీలు క్రమము తప్పకుండా పౌష్టికాహారం అంగన్వాడి కేంద్రాలలో పొందాలని కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ అన్నారు. మండ లంలోని పడమర కట్టకిందపల్లి అంగన్వాడీ కేంద్రము నందు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు లో భాగముగా బుధవారం తల్లులకి అవగాహన కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంఎస్ పార్వతీ ఆధ్వర్యంలో నిర్వ హించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లా డుతూ ప్రకృతి ప్రసాదించిన వరం తల్లిపాలు అని మీ బిడ్డలకు తప్పక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నారాయ ణ, వెంకట కొండయ్య, లక్ష్మణ, చందు, ప్రసాదు ఏఎన్ఎం పి. పద్మావతి ఆశ వర్కర్ బి . పద్మ అంగన్వాడీ కార్యకర్త షేక్ రజియా బేగం, గర్భవతులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

-ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్.వి రమణ డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం: రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ నూతనంగా అక్రిడేషన్లు వెంటనే మంజూరుతో పాటు ప్రమాద బీమా పాలసీని వెంటనే అమలు చేయాలని ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు ఎన్ వి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ డిమాండ్ డే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్వి రమణ మాట్లాడుతూ ఆన వాయితీగా జర్నలిస్టులకు ఇస్తున్న అక్రిడేషన్ ల మంజూరు విషయంలో ప్రభుత్వం ఎందుకు ఇన్ని వాయిదాలు వేస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి 16 మాసాలు కావస్తున్నప్పటికీ నూతన అక్రిడిటేషన్ లను మంజూరు చేయకపోవడం చాల బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ లు, ప్రమాద బీమా పాలసీతో పాటు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమాచార శాఖ కమిషనర్, మంత్రి పార్థ సారథి, చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం పలు మార్లు స్వయంగా కలసి విన్నవించినప్పటికి ఫలితం లేదని ఆయన అన్నారు. నూతన అక్రిడేషన్ లను మంజూరు చేయకపోవడంతో గత రెండు సంవత్సరాల క్రితం కొత్తగా జర్నలిస్ట్ వృత్తిని స్వీకరించిన వాళ్ళు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎందుకంటే అక్రిడిటేషన్ కార్డు ఉంటేనే హెల్త్ ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుందని అన్నారు. అలాగే పాత్రికేయ వృత్తిలో అనేక సేవలు అందించి సమాజ అభివృద్ధికి పాటుపడి పదవి విరమణ చేసిన జర్నలిస్ట్ లకు బీహార్ రాష్ట్ర తరహాలో ఏపి లో కూడా రూ. 20 వేలు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల ప్రదర్శన అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో పై సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డి ఏ ఓ కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి. మోహన్ రెడ్డి, యూనియన్ జిల్లా కోశాధికారి దారివేముల బాబి, జిల్లా కమిటీ సభ్యులు జి. రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు వేలుదండ సుబ్రమణ్యం, యూనియన్ నాయకులు ఎస్ కె మహబూబ్ సుభాని, బి. సుబ్బారావు, డి. జగన్ మోహన్ రెడ్డి, ఎస్ కె బషీర్, వేసపోగు రాజు, మల్లికార్జున రెడ్డి, బుదాల సురేష్, ఎస్ కె కరీం, ఎస్ కె ఖలీల్, ఎస్ కె. షౌకత్, వెంకట్, ముకుందర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

-ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమీ

విశాలాంధ్ర-పామూరు: మద్యం బెల్ట్ షాపు లను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమి అన్నారు. బుధవారం ఐద్వా 8 వ మండల మహాసభ పాత శారద విద్యాలయంలో కే భానుమతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా షమీ మాట్లాడుతూ వైసీపీ సీసా లో కూటమి మద్యం ఏరులైపా రుతుందని అన్నారు. రాజకీయ నాయకులు అండతో గ్రామాలలో బెల్ట్ షాపులు జోరుగా కొనసాగిస్తున్నారన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటాయని వాటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆమె విమర్శించారు. మహిళల సమస్యలను ఐక్యంగా ఎదుర్కోవా లని పిలుపునిచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఐద్వా జిల్లా నాయకురాలు ఉసా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఐక్యమైతే దేనినైనా సాధించగలమని అన్నారు. ఉపాధి హామీ పనులు ఆపడం వలన మహిళలకు కుటుంబాన్ని నడపటం కష్టంగా ఉందని ఆమె అన్నారు. ఉపాధి లేక యువత ఇతర ప్రాంతాలకు వలస పోతువున్నారన్నారు. మహాసభ కార్యక్రమంలో మధారమ్మ, ఖాదర్ ఉనేషా, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

విశాలాంధ్ర- పెద్ద దోర్నాల: దోర్నాల మండలం తిమ్మాపురం గ్రామం నందు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగనవాడి సెంటర్లో అంగన్వాడీ కార్యకర్తలు జి సువాసిని ,దొడ్డ రామలక్ష్మి కుమారి, కోడి రాణి ,ఆధ్వ ర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథి గా ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని, ఆమె అన్నారు, బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రు పాలు తాపినట్లైతే ఒక బలమైన రోగనిరోధక టికవంటిదని ఆమె అన్నారు. ఈ ముర్రుపాలు రోగనిరోధక శక్తిని బిడ్డకు అందిస్తుందని బిడ్డపై తల్లికి ప్రేమ పెరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజ మ్మ ఏఎన్ ఎం వాలీబాయి, హెల్త్ వర్కర్ వెంకటేశ్వర రెడ్డి , సచివాలయ మహిళ పోలీస్ అనంతలక్ష్మి బాలింతలు గర్భవతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయు నది ఏమనగా, నా క్లయింట్స్ అయిన 1) చీమలదిన్నె ఆది మాలకొండయ్య, 2)చీమలదిన్నె మాల్యాద్రి మరియు 3)చీమలదిన్నె మాలకొం డయ్య@ కొండల రావు గార్ల సూచనల ప్రకారం (ప్రకాశం జిల్లా కనిగిరి సబ్.డి., కనిగిరి(మం), శంకవరం పంచాయితీ పరిధిలోని మాచవరం మజిరా, చింతపాలెం గ్రామంలో 490రు పట్టా దాఖలా,1వ ఐయిటం:కోరుమెట్ల సర్వే నెం. 400/సి యి.21.90సెంట్లులో 1బి ఖాతా నెం. 382రు దాఖలా య.0.80సెంట్లు లేక 0.323 హెక్టార్లు గల భూమి మరియు 2వ ఐయిటం: డిటో సర్వే నెం.400/సిలో య.0.30 సెంట్లుగల భూములు కోర్టు వివాదములో మహా రాజశ్రీ కందుకూరు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో ఐ.ఏ. నెం.224/2025 ఓ.యస్. నెం. 20/2025గా దావా పెండింగ్‌లో వున్నదని సదరు దావాలో ఇంజక్షన్ ఉత్తర్వులు కూడా ఇచ్చియున్నారు. కావున సదరు ఆస్తిపై ఎలాంటి క్రయ విక్రయాలు, లావాదేవీలు గాని జరప రాదని అలా జరిపినయెడల నా క్లయింట్లు తీసు కొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులౌతారని తెలియపరచటమైనది.

షేక్ సుభాని, అడ్వకేట్, బి.ఎ. బి.యల్.యల్.బి.
పాత డోర్.నెం.24-24-67, కొత్త డోర్.నెం.81-14-1213, 13/1 నల్లచెరువు, గుంటూరు-3. సెల్: 9949398737

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి,మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ ఉల్లంఘనల నివారణ చర్యలలో భాగంగా ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సోమ,మంగళవారాల్లో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించగా,మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 48 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయబడినట్లు తెలిపారు. వీరిని సంబంధిత న్యాయస్థానాలలో హాజరుపరచడం జరుగుతుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే, అతివేగం, హెల్మెట్ ధారణ,బ్లాక్ స్పాట్ సందర్శన వంటి వాటిపై కూడా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని,ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.

పీవీఎన్ మాధవ్‌ని కలిసిన ఎమ్మెల్యే వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల నియోజకవర్గ పర్యటనకి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

గుడ్,బాడ్ టచ్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని కొండమండులూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థినిలు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలని ఇంటిలో కాని,బడిలో కాని,బయటకాని అప్రమత్తంగా చైతన్యంగా తెలివిగా,చురుకుగా ఉండాలని చెప్పారు. అలాగే డ్రగ్స్ గురించి దాని వలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ జోలికి వెళ్లడం వలన జీవితాలు కుటుంబాలు నాశనం అవటంతో పాటు చట్టపరంగా అనేక శిక్షలు అనుభవించవలసి వస్తుందని కాబట్టి వాటికి దూరంగా ఉండాలని,నేటి విద్యార్థులే రేపటి పౌరులు కాబట్టి మీరు అప్రమత్తంగా అవగాహన కలిగి ఉండి ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులను చైతన్యపరిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ సిబ్బంది,జె.పంగులూరు స్టేషన్ ఎస్సై వినోద్ బాబు పాల్గొన్నారు.

బూర్లవారిపాలెం,పిట్లువారిపాలెంల్లో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల మండల వ్యవసాయ అధికారి పి.నిర్మల దేవి మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువులను వేసుకోవాలన్నారు. దీనితో ఎరువుల ఖర్చు ఆదా అవడమే కాకుండా భూమి పాడవకుండా ఉంటుందన్నారు. అంతే కాకుండా నేలలో సేంద్రియ ఎరువులను కలియదున్నడం వలన నేల యొక్క భూసారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. భాస్వరం ఎరువులను పంట తొలి దశలోనే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిఏ కె.నీలిమ,ఏపీ సీఎంఎఫ్ సిబ్బంది పావని,రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మునిసిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి,జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ సిబ్బందికి సూచించారు. పురపాలక సంఘ కమిషనర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశాలను అనుసరించి సచివాలయ పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు,ఎమినిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి మాట్లాడుతూ ప్రమాదకర సీజనల్ వ్యాధులైన డెంగ్యూ,మలేరియ, టైఫాయిడ్ వంటి విష వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటిపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాటి నివారణ చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని తప్పక నిర్వహించాలని సూచించారు. భాగంగా గృహాల మధ్య నీటి తొట్టెలలో ఎక్కువ రోజులు నుంచి నీటి నిల్వలను ఉంచరాదని అట్లు ఉన్న నీటి నిల్వలను,కొబ్బరి బోండాలను,ప్లాస్టిక్ వ్యర్థాలను పనికి రాకుండా నిరుపయోగంగా గృహాల మధ్యలో ఉన్న వస్తువులను తొలగించాలన్నారు. క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా ప్రతిరోజు పర్యటించి వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలను గుర్తించి తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుచున్నది లేదో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతిరోజు నీటి నమూనాలను సేకరించి క్లోరిన్ పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతిరోజు ప్రధాన అంతర్గత వీధుల నందు పర్యటించి త్రాగునీటి పైపులైను లీకేజీలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన వాటిని సరిచేయాలని ఆదేశించారు. ప్రతిరోజు వార్డులలో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాలను గురించి పారిశుధ్య కార్మికులకు సూచనలు చేసి పారిశుధ్యం మెరుగు పడే విధంగా కృషి చేయాలన్నారు. దోమలు ప్రబలకుండా డ్రైనేజీలలో యాంటీ లార్వాల్ పిచికారి తప్పక చేపట్టాలన్నారు. ప్రధాన డ్రైనేజీలలో వార్డుల అంతర్గత డ్రైనేజీలలో మట్టి పూడికలు ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. పురపాలక సంఘానికి పట్టణ ప్రజలు కూడాను సహకరించి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రాణాంతక వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకొని పట్టణ పారిశుధ్యంలో విషయంలో మీ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆశించారు. ప్రజారోగ్యం విషయంపై తెలిపిన సూచనల అమలులో సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యస్.యస్ కృష్ణారెడ్డి, వైద్యులు,శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణ, ప్రజారాజ్య విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్

విశాలాంధ్ర - సంతమాగులూరు : అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్ అన్నారు. బుధవారం ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టులో తల్లిపాల వారోత్సవాలు,ట్రీ ప్లాంటేషన్ ప్రోగ్రాంలను సిడిపిఓ డి.సుధ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అతిథులుగా ప్రాజెక్టు డైరెక్టర్ బాపట్ల రాధా మాధవి,ఏఎంసీ చైర్మన్ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాధా మాధవి మట్లాడుతూ గర్భందాల్చిన మహిళలకు ముందుగానే తల్లి పాల ప్రాముఖ్యతను తెలియజేశారు. బిడ్డ పుట్టిన తర్వాత గంట లోపు ముర్రుపాలు తాగేలా అంగన్వాడి కార్యకర్తలు తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ నిర్మల్ కుమార్ మట్లాడుతూ బ్రెస్ట్ ఫీడింగ్ వలన తల్లికి,బిడ్డకు ఇద్దరికీ ఆరోగ్యమని,రొమ్ము క్యాన్సర్,సర్వేటికల్ క్యాన్సర్ వంటివి దరిచేరవని చెప్పారు. తల్లి పాలతో పిల్లలకు తెలివితేటలు బాగుంటాయన్నారు. అలాగే బిడ్డకు పాలు ఇచ్చేటప్పుడు తల్లి పరిశుభ్రత పాటించటం వలన బిడ్డలు వ్యాధి బారిన పడకుండా ఉంటారని తెలియజేశారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మొక్కలు నాటారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంతమాగులూరులో తల్లిపాలు ఇచ్చే గదిని రమేష్,రాధా మాధవి ఆవిష్కరించారు. అనంతరం రాధా మాధవి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగనవాడీ సెంటర్స్ పరిశుభ్రంగా ఉండాలని,అన్ని రిజిస్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని చెప్పారు. పూర్వ ప్రాథమిక విద్య సక్రమంగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా కోడిగుడ్లకు కలర్ కోడ్ ఇవ్వడం లేదని,దీని గురించి సిడిపిఓ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సిడిపిఓ సుధా మట్లాడుతూ పోషణలోపం పిల్లల గురించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజార్లు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యం

విశాలాంధ్ర - యద్దనపూడి : తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యమని ఐసిడిసి సూపర్వైజర్ సిహెచ్ సుజాత అన్నారు. మండలంలో చిమటా వారిపాలెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన,ఇరువురికి లాభదాయకమని,తల్లికి తల్లి బిడ్డకు పాలు ఇవ్వటం వలన రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు,గర్భిణిగా ఉన్న సమయంలో పెరిగిన శరీర ఆకృతి సాధారణ స్థితికి వచ్చుటకు,బిడ్డకు పాలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమం చిమటవారిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జెజె శామ్యూల్ రాజు,ఆశా వర్కర్ నాగమణి,అంగన్వాడి కార్యకర్త కే.హైమావతి, అంగన్వాడి సహాయకురాలు జి.అనుష,తల్లులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర వ్యాప్త మాజీ సైనికుల ఉన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను కలిసిన అర్జీ అందజేశారు. బాపట్ల పట్టణం పటేల్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో పివిఎన్ మాధవ్‌ను కలిసి రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సైనికులు మాజీ సైనికుల కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ సైనికులుతో కలసి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ సైనికులు ల్యాండ్ కోసం అప్లై చేసుకోవటానికి ఉన్నటువంటి మూడు సంవత్సరాల కాల పరిమితిని ఎత్తివేసి తన జీవితకాలంలో ఎప్పుడైనా ల్యాండ్ కోసం అప్లై చేసుకోవటానికి వెసులుబాటు కల్పించాలి ఆయన కోరారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసులు సరిపడా ఉద్యోగస్తులతో పెట్టేలా చర్యలు తీసుకోవాలని,బాపట్లతో సహా ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో సైనిక్ వెల్ఫేర్ ఆఫీసుల కొరకు, వార్ మెమోరియల్ కొరకు మాజీ సైనికుల ఆఫీసుల కొరకు స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆయను కోరారు. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మొదలగు వాటిలో ఉద్యోగాల కోసం వెలువడుతున్న నోటిఫికేషన్‌లలో మాజీ సైనికులకు ఏజ్ రిలాక్సేషన్ ఇవ్వకపోవడం వలన మాజీ సైనికులకి అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న మాజీ సైనికుల సమస్యలపై త్వరలో ప్రత్యేకమైన వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు మాధవ్ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషా రెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణా రావు, జనరల్ సెక్రటరీ షేక్ మొహిసుద్దీన్,రాష్ట్ర కమిటి గౌరవ సలహాదారులు సుంకర శేషగిరి రావు, బాపట్ల జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాల శివా రెడ్డి,సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గా రావు,డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.